13-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీకు ఎవరి పట్ల వైరము ఉండకూడదు ఎందుకంటే మీరు అందరి కళ్యాణకారులు, వైరము పెట్టుకునేవారిని హాఫ్ కాస్ట్ బ్రాహ్మణులు (సగం శూద్రులు, సగం బ్రాహ్మణులు) అని అంటారు"

ప్రశ్న:- ఏ స్మృతి బుద్ధిలో సదా ఉన్నట్లయితే నిర్భయులుగా అవుతారు?

జవాబు:- సదా స్మృతిలో ఉండాలి - మేము సత్యఖండానికి అధిపతులైన దేవీ-దేవతలుగా అవుతున్నాము, శరీరాన్ని ఎవరైనా హతమార్చగలరేమో కానీ ఆత్మను హతమార్చలేరు. తుపాకి గుండు శరీరానికే తగులుతుంది. ఆత్మనైన నేనైతే బాబా వద్దకు వెళ్ళిపోతున్నాను, నాకు భయమేమి ఉంది. మనం కూర్చున్నాము, పై నుండి ఇంటి కప్పు పడిపోతుంది, మనం బాబా వద్దకు వెళ్ళిపోతాము. ఇందులో భయపడే విషయమేదీ లేదు. ఈ విధంగా నిర్భయులుగా అవ్వాలి.

పాట:- మాతా, ఓ మాతా...

ఓం శాంతి. పిల్లలు జగదాంబ మహిమను విన్నారు. మనుష్యులైతే కేవలం పాడుతూ ఉంటారు. జగదాంబకు మేళాలు జరుగుతున్నాయి. ఇప్పుడు ఇదేమో సంగమము. తండ్రితో పిల్లల మేళా జరుగుతుంది. తండ్రి ఉంటే తప్పకుండా తల్లి కూడా ఉంటారు. భారత్ లో జగదాంబ జీవిత గాథ గురించి ఎవరికీ తెలియదు. ఆమె జగత్తును రచించేవారు అనగా జగదాంబ. జగదాంబ మందిరాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు పిల్లలైన మీకు వివేకం లభించింది, జ్ఞానమనే మూడవ నేత్రము లభించింది. ఎవరి స్మృతి చిహ్నమైతే తయారుచేయబడి ఉందో, వారు తప్పకుండా సృష్టి సంగమంలోనే వచ్చి ఉంటారు అని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. వీరిని జగదాంబ అని అంటారు. జగత్ పిత, ప్రజాపిత కూడా ఉన్నారు కదా.

ఈ అనంతమైన డ్రామా యొక్క ఆదిమధ్యాంతాలు ఏమిటి మరియు ముఖ్యమైన పాత్రధారులు ఎవరు - ఇది ఎవ్వరికీ తెలియదు. హీరో, హీరోయిన్లు కూడా పాత్రధారులే కదా. పాత్రధారులు అనేవారు కేవలం ఇద్దరే ఉండరు. తప్పకుండా వారి సైన్యము కూడా ఉంటుంది. జగదాంబకు కూడా సైన్యము ఉంటుంది. వారిని శక్తులు అని కూడా అంటారు. శక్తిసేన ఎంతో ప్రసిద్ధమైనది. శక్తి ఎక్కడి నుండి వచ్చింది? తప్పకుండా సర్వశక్తివంతుడైన పరమపిత పరమాత్మ నుండే శక్తి తీసుకొని ఉంటారు - ఈ విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడే. వారినే సత్ శ్రీ అకాల్ అని అంటారు. అకాలీలు (సిక్కులలోని ఒక సాంప్రదాయం వారు) నిరాకారుడిని నమ్ముతారు. సిక్కు గ్రంథీలు (సిక్కుల గురుద్వారాలో గ్రంథ్ సాహబ్ ను పఠించి అందరికీ వినిపించేవారు మరియు పౌరోహిత్యం చేసేవారు) గురునానక్ ను నమ్ముతారు. వారు గురునానక్ దేవ్ అని అంటారు. వారి తరాలు ఏవైతే ఉంటాయో, అందులో 10 మహారాజుల పేర్లూ భిన్న-భిన్నంగా ఉన్నాయి. కొందరికి సింఘ్, కొందరికి దాస్, కొందరికి చంద్ అన్న పేర్లు కూడా ఉంటాయి. అందరి పేర్లు భిన్న-భిన్నంగా ఉంటాయి. అకాలీలు ఎవరైతే ఉంటారో, వారు ఆకాలమూర్తిని విశ్వసిస్తారు. సత్ శ్రీ అకాల్ - ఇలా ఎవరిని మహిమ చేసారు? పరమపిత పరమాత్మను. కావున సత్యమైనవారు ఒక్క శ్రేష్ఠాతి-శ్రేష్ఠుడైన, అకాలమూర్తి అయిన పరమాత్మయే అని నిరూపించబడుతుంది. మీరు సత్ శ్రీ అకాల్ అని అనవచ్చు. మీకు వారి గురించి తెలుసు. వారు కేవలం ఆ పదాన్ని ఉపయోగిస్తారు కానీ అర్థమేమీ తెలియదు. మీకు సత్ శ్రీ అకాల్ (సత్యమైన-శ్రేష్ఠమైన-అకాలమూర్తి) గురించి తెలుసు. వారి చరిత్ర గురించి కూడా మీకు తెలుసు. విచార సాగర మంథనము కూడా పిల్లలైన మీరే చేయాలి. తండ్రి అయితే జ్ఞానసాగరుడు. వారు కలశాన్ని మాతలకు ఇచ్చారు. వీరు పెద్ద తల్లి మరియు మీరు అనేక మంది మాతలు. జగదాంబకు అనేకమంది కుమార్తెలు మరియు కుమారులు ఉన్నారు. వీరు జగదాంబ, వీరితో పాటు తండ్రి కూడా తప్పకుండా ఉన్నారు. ఈ జగదాంబ ఎవరు, ఈమె ఎవరి కుమార్తె అనేది మీకు తెలుసు. ఈమె మనిషే, ఈమెకు 8-10 భుజాలైతే లేవు. ఇన్ని భుజాలను ఎందుకు ఇచ్చారు - ఇది ఎవరికీ తెలియదు. ఉన్నతోన్నతమైనవారు ఆ సత్యమైన పరమాత్మయే. పిల్లలైన మీకు అర్థం చేయించడం జరిగింది - పరమపిత పరమాత్మ, ఎవరినైతే మనము రూప్-బసంత్ అని అంటామో, వారు రూప్ కూడా మరియు బసంత్ కూడా, వారు జ్ఞానసాగరుడు. వారు ఎంతో చిన్న బిందువు, వారు జ్ఞానసాగరుడు. విచిత్రము కదా. తండ్రి బిందు స్వరూపుడని, వారిలో తప్పకుండా మొత్తం పాత్ర అంతా నిండి ఉంది అని పిల్లలకు అర్థం చేయించడం జరిగింది. వారు భక్తి మార్గంలో భక్తుల భావనను పూర్తి చేస్తారు. ఇదంతా డ్రామాలో నిశ్చితమై ఉంది. ఏ సమయంలో ఎవరికి ఏ భావన ఉంటుందో, అది

డ్రామాలో ముందు నుండే నిశ్చితమై ఉంటుంది. మీ ఈ చదువు కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది, ఆ పాత్ర మళ్ళీ రిపీట్ అవుతోంది. ఇది అర్థం చేసుకోవలసిన విషయం కదా. భగవంతుడిని ఉన్నతోన్నతమైనవారు అని అందరూ అంటారని మీరు మంచి రీతిలో అర్థం చేయించవచ్చు. వారు నిరాకారుడు, నిర్భయుడు, నిర్వైరుడు... వారికి ఎవరి పట్ల వైరము లేదు. మీకు కూడా ఎవరి పట్ల వైరము లేదు. మీరు అందరి కళ్యాణకారులు. ఎవరి పట్లనైనా వైరము ఉన్నట్లయితే వారిని హాఫ్ కాస్ట్ అని అంటారు అనగా సగం శూద్రులు, సగం బ్రాహ్మణులు. ఎప్పుడైతే ఈ వికారాల మాలిన్యము పూర్తిగా తొలగిపోతుందో, అప్పుడు సత్యమైన బ్రాహ్మణులు అని అంటారు. ఇప్పుడు సగం-సగంగా ఉన్నారు. కలియుగీ తమోప్రధాన సంస్కారాలు నిండి ఉన్నాయి, అవి ఇంకా పోవాలి. ఇప్పుడు మిమ్మల్ని దేవతలు అనీ అనరు, అలాగే శూద్రులు అనీ అనరు, మధ్యలోని బ్రాహ్మణులు అని అంటారు. అది కూడా సంపూర్ణముగా అవ్వలేదు. జగదాంబను దేవత అనరు. జగదాంబ ఎప్పుడైతే సంపూర్ణము అవుతారో, అప్పుడు దేవతగా అవుతారు. ఇప్పుడు బ్రాహ్మణులుగా ఉన్నారు. బ్రహ్మ పుత్రిక సరస్వతి. కానీ ఈ విషయం ఎవరికీ తెలియదు. ముఖవంశావళి రచనను రచించేందుకు అసలు బ్రహ్మ ఎప్పుడు వచ్చారు? వారినే శివశక్తి సేన అని అంటారు. ఆ ఉన్నతోన్నతుడైన తండ్రి పరమపిత అని, వారు పరంధామంలో ఉంటారని మీకు తెలుసు. తర్వాత సూక్ష్మవతనంలో బ్రహ్మ, విష్ణు, శంకరులు ఉంటారు. ప్రవృత్తి మార్గమైన కారణంగా వారిని కూడా యుగళులుగా చూపిస్తారు. విష్ణువును పూర్తి యుగళ రూపంగా చూపిస్తారు. ఇవన్నీ బుద్ధిలో ఉండాలి. మనుష్యులు - మేము పాత్రధారులము అని అంటారు. కావున మనుష్యులకు డ్రామా ఆదిమధ్యాంతాల గురించి తెలియాలి కదా. ఉన్నతోన్నతుడైన భగవంతుడు ఎవరు? బ్రహ్మ, విష్ణు, శంకరులు ఎవరు? 8-10-100 భుజాలు కలవారు ఇంకా ఎవరైనా ఉన్నారా? లేరు, ఈ చిత్రాలన్నీ వ్యర్థమైనవి. బ్రహ్మకు 100 భుజాలను చూపిస్తారు. ఇప్పుడు వీరైతే ప్రజాపిత, 100 భుజాల విషయమేమీ లేదు. ఇవన్నీ రాంగ్. వాస్తవానికి రైట్ ఏమిటి, అది కూడా అర్థం చేసుకోవాలి. ఉన్నతోన్నతుడైన భగవంతుడు ఎవరైతే పరంధామంలో ఉంటారో, వారు నక్షత్రము. విష్ణువుకు కూడా 4 భుజాలను చూపించారు - రెండు భుజాలు లక్ష్మివి, రెండు భుజాలు నారాయణుడివి. ఏ విధంగా రావణుడికి 10 తలలు చూపిస్తారు, అందులో 5 స్త్రీలోని వికారాలు మరియు 5 పురుషునిలోనివి. మొట్టమొదటి ముఖ్యమైన వికారము దేహాభిమానము. ఆ తర్వాత మిగిలిన వికారాలు నంబరువారుగా వస్తాయి. సూక్ష్మవతనవాసి బ్రహ్మ అవ్యక్తమైనవారు. ప్రజాపిత బ్రహ్మ అయితే ఇక్కడే కావాలి కదా. వీరు ఎప్పుడైతే సంపూర్ణంగా అవుతారో, అప్పుడు సూక్ష్మవతనంలో ఫరిశ్తాగా అవుతారు. మీరు కూడా ఫరిశ్తాలుగా అవుతారు. అక్కడ మీ శరీరము రక్త మాంసాలతో కూడినదిగా ఉండదు. అక్కడి రూపాన్ని ఫరిశ్తా అని అంటారు. బ్రహ్మ అయితే ప్రజాపిత, వారు ఇక్కడ ఉన్నారు. ఆ తర్వాత విష్ణువు రెండు రూపాలతో పాలన చేస్తారు. శంకరుడు సూక్ష్మవతనంలో ఉన్నారు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన విషయాలు. ఇంతటి దూరదృష్టి కల బుద్ధి ఎవ్వరికీ లేదు. మీ బుద్ధి పూర్తిగా మూలవతనము, సూక్ష్మవతనము వరకు వెళ్ళింది. సూక్ష్మవతనము ఇప్పుడు రచించబడింది. బ్రహ్మ, విష్ణు, శంకరుల రచన కూడా జరిగింది, అక్కడ వరకూ వెళ్ళి రాగలుగుతారు. ఉన్నతోన్నతమైనవారు భగవంతుడు, ఆ తర్వాత బ్రహ్మ, విష్ణు, శంకరులు, ఆ తర్వాత ఈ మనుష్య సృష్టిలో దేవీ-దేవతలు. అంతేకానీ 8-10 భుజాలు కలవారు లేక చండికా దేవి మొదలైనవారైతే ఎవరూ లేరు. ఇన్ని చిత్రాలు ఎక్కడి నుండి వచ్చాయి? మీ వద్ద ఆయుధాలు ఏమైనా ఉన్నాయా. ఈ హింసాయుతమైన ఆయుధాలన్నింటినీ కూర్చొని తయారుచేసారు. దేవతలు డబుల్ అహింసకులు. సూక్ష్మవతనంలో ఆయుధాలు మొదలైనవేవీ ఉండవు. చిత్రాలలో ఎన్ని ఆయుధాలను చూపించారు. దీనిని బొమ్మల పూజ అంటారు. వారి కర్తవ్యము గురించి ఎవరికీ తెలియదు. బాబా వచ్చి బ్రహ్మ ద్వారా కొత్త రచనను రచిస్తారు. కావున వారు పెద్దవారు అయినట్లు కదా. మీరు వారి సంతానమైన మనుమలు మరియు మనుమరాళ్ళు. అర్థం చేసుకునేవారు అర్థం చేసుకుంటారు కూడా, కానీ ఇప్పుడు అందరి మృత్యువు జరుగనున్నది అన్నది అర్థం చేసుకోరు. ఇప్పుడు కూడా ఎంత మంది మరణిస్తూ ఉంటారు. వార్తాపత్రికలు మొదలైనవాటిలో ఏమైనా చూపిస్తారా, చూపిస్తే పేరు అప్రతిష్టపాలవుతుంది. ఆకలితో ఎంతోమంది మరణిస్తారు. కష్టం మీద ఒకే ఒక పూటకు రెండు రొట్టెలు లభిస్తాయి. సత్యయుగంలో లక్ష్మీ-నారాయణుల రాజ్యం నడుస్తుందని పిల్లలైన మీరు తెలుసుకున్నారు. అక్కడ రెండు భుజాల కల మనుష్యులే ఉంటారు. అంతేకానీ సత్యయుగంలో 8-10 భుజాలు కల దేవతలు ఎవరూ ఉండరు. రెండవ నంబరులో సీతా-రాములు ఉన్నారు. వారు కూడా ఇక్కడ రాజయోగము ద్వారా పదవిని పొందుతున్నారు. ఇది అర్థం చేసుకోవలసిన ఎంత సహజమైన విషయము. తండ్రి అంటారు - మీరు ఎన్నో వేద-శాస్త్రాలను చదివారు, ఇప్పుడు మీరు నా నుండి వినండి మరియు నిర్ణయించండి - మీకు నేను సత్యాన్ని వినిపిస్తున్నానా లేక వారు సత్యాన్ని వినిపిస్తున్నారా? ఒకవేళ వారు సత్యాన్ని వినిపిస్తున్నట్లయితే మరి మీరు ఆ సత్యనారాయణ కథ ద్వారా సత్యనారాయణునిగా ఎందుకు అవ్వలేదు?

ఇప్పుడు మీరు ప్రాక్టికల్ గా సత్యమైన బాబా ద్వారా సత్యమైన కథను వింటున్నారు - నారి నుండి లక్ష్మిగా, నరుని నుండి నారాయణునిగా తయారయ్యే కథ ఇది. తప్పకుండా ప్రజలు కూడా తయారవుతారా లేక కేవలం లక్ష్మీ-నారాయణులే వెళ్ళి సింహాసనంపై కూర్చుంటారా? ఇప్పుడు దేవీ-దేవతల రాజధాని స్థాపనవుతుంది, తర్వాత సత్యయుగంలోకి వచ్చి రాజ్యం చేస్తారు. అక్కడ రాజులకు సైన్యము మొదలైనవేవీ ఉండవు. సైన్యాలు వికారీ అపవిత్ర రాజులకు ఉంటాయి. వారు పవిత్రమైన రాజులు. సత్యయుగాన్ని హోలీ ల్యాండ్ (పవిత్రమైన భూమి) అని అంటారు, దీనిని అన్ హోలీ ల్యాండ్ (అపవిత్రమైన భూమి) అని అంటారు. చాలా పాతగా, పతితంగా అయిపోయింది. కొత్తది పాతగా అవ్వాల్సిందే. శరీరాలు కూడా మొదట కొత్తగా ఉంటాయి, తర్వాత పాతగా అవుతాయి. ఇది బుద్ధిలో కూర్చోవాలి కదా. మనుష్యులై ఉండి కూడా డ్రామా ఆదిమధ్యాంతాల గురించి తెలియదు. మీకు తెలుసు - ఉన్నతోన్నతమైన శివబాబా మూలవతనంలో ఉంటారు. దానిని నిరాకారీ ప్రపంచము అని అంటారు. బిందువులైన ఆత్మలు కూడా అక్కడే ఉంటాయి. కానీ బిందు రూపాన్ని మాత్రమే చూపించినట్లయితే ఎవరైనా ఎలా అర్థం చేసుకోగలరు? బిందువుకు పూజ ఎలా చేస్తారు? శివబాబా యొక్క బిందు రూపానికి పూజ ఎలా చేయగలరు? తిలకం ఎలా పెట్టగలరు? బాబా అమరనాథ్ కు కూడా వెళ్ళారు. శివలింగాన్ని ఎలా తయారుచేస్తారు అంటూ బాబా అన్నీ చూసి వచ్చారు. అక్కడ పార్వతికి శంకరుడు కథ వినిపించారు అని అంటారు. ఇప్పుడు పార్వతి ఏ దుర్గతిని పొందారని ఆమెకు కూర్చొని కథను వినిపించారు? వాస్తవానికి మీరందరూ పార్వతులు. మీరు జనన-మరణాలలోకి వస్తారు మరియు సద్గతిని పొందేందుకు కథ వింటున్నారు. అయితే అక్కడ, శివలింగము ఎక్కడ ఉంది అని అడిగితే, అప్పుడు, శివలింగము దానంతటదే ఉద్భవిస్తుంది అని సమాధానమిచ్చారు. అరే, ఇదెలా జరుగుతుంది! అక్కడ పావురాలను కూడా చూపిస్తారు. పావురాలు ఎప్పుడూ మాట్లాడడం నేర్చుకోవు. చిలుకలకు మాట్లాడడం నేర్పిస్తారు, అప్పుడవి మాట్లాడతాయి. దానికి కంఠస్థమైపోతుంది. మీరు జ్ఞానపు కంఠహారాన్ని ధరిస్తారు. బాబా అర్థం చేయించారు - ఉన్నతోన్నతమైనవారు శివబాబా, ఆ తర్వాత బ్రహ్మా, విష్ణు, శంకరులు. ప్రవృత్తి మార్గాన్ని చూపించేందుకు విష్ణువుకు 4 భుజాలను చూపిస్తారు. ఇక్కడ మనుష్య సృష్టిలో ఉన్నతోన్నతమైనవారు లక్ష్మీ-నారాయణులు మరియు వారి రాజధాని, ఆ తర్వాత సీతా-రాములు వంశావళి. ఈ పవిత్ర వంశావళి పూర్తవుతుంది. ఆ తర్వాత రావణ రాజ్యము ప్రారంభమవుతుంది. మళ్ళీ అందరూ పతితులుగా అవ్వవలసిందే. ఇకపోతే చివరిలో కొత్త ఆత్మలు ఎవరైతే వస్తారో, వారి ప్రభావం ఎంతోకొంత వెలువడుతుంది. కొందరికి సతోప్రధానత యొక్క పాత్ర ఉంటుంది, కొందరికి రజో-తమో పాత్ర ఉంటుంది. ఇది అనంతమైన డ్రామా. మనుష్యులు మనుష్యులే. మిగిలినదంతా బొమ్మల పూజ. మీరు పాత్రధారులు కదా. ఇప్పుడు మీరు మనుష్యుల నుండి దేవతలుగా అవుతున్నారు. చదువు ద్వారా మనుష్యులు ఎంత ఉన్నత పదవిని పొందుతారు. ఇది కూడా చదువే, దీని ద్వారా మీరు రాజ్య పదవిని పొందుతారు. ఇటువంటి చదువు ఇంకేదీ ఉండదు. ఆ యువరాజు-యువరాణులు తమతో పాటు ప్రారబ్ధాన్ని తెచ్చుకుంటారు. మీరూ ఇక్కడ ప్రారబ్ధాన్ని తయారు చేసుకుంటున్నారు. భవిష్య సత్యయుగం కొరకు ఇది ఎంత ఉన్నతమైన మరియు సహజమైన జ్ఞానము - క్షణంలో జీవన్ముక్తి. మనం అనంతమైన తండ్రి పిల్లలము, ఈశ్వరీయ ఒడిలో కూర్చున్నాము. ఈశ్వరీయ ఒడిని ఎవరు వదులుతారు?

ఈ డ్రామా ఆదిమధ్యాంతాల గురించి అర్థం చేసుకోవాలి. తండ్రి అయితే యథార్థ రీతిలో కూర్చొని అర్థం చేయిస్తారు. వారిని మనుష్య సృష్టికి బీజరూపుడు అని మహిమ చేస్తారు. వారిని సత్-చిత్-ఆనంద స్వరూపుడు అని అంటారు. తప్పకుండా వారు ఎప్పుడైతే వస్తారో, అప్పుడే వారసత్వాన్ని ఇస్తారు కదా. మీరు సత్యఖండానికి అధిపతులుగా, దేవీ-దేవతలుగా అవుతారు. ఇందులో భయపడే విషయమేదీ లేదు. ఇక్కడైతే - ఎవ్వరూ ఆక్రమించకూడదు అని ఎంత భయముంటుంది. మీరైతే పూర్తిగా నిర్భయులుగా ఉండాలి. ఎవరైనా శరీరాన్ని హతమార్చగలరు కానీ ఆత్మను హతమార్చగలరా, మరి ఎందుకు భయపడడము. నిర్భయులుగా అయ్యేందుకు చాలా వివేకం కావాలి. తండ్రి కూడా నిర్భయులు, అలాగే పిల్లలు కూడా నిర్భయులే. తుపాకీ గుండు శరీరానికి తగులుతుంది, ఆత్మనైన నేనైతే బాబా వద్దకు వెళ్తున్నాను, నాకేమి భయము ఉంది. మనం కూర్చుని ఉన్నాము, ఇంటి పైకప్పు పడిపోతుంది, మనం బాబా వద్దకు వెళ్ళిపోతాము. నిర్భయులుగా అవ్వడానికి సమయం పడుతుంది. మీరు జగదాంబ పిల్లలైన శివశక్తి సైన్యము. ఇది కేవలం ఒక్కరి మహిమ మాత్రమే కాదు. మీరు కూడా తోడుగా ఉన్నారు. వీరు కమాండర్. మీకు ఆత్మిక డ్రిల్ నేర్పిస్తారు. మీరు వారి పిల్లలు. మీరు అదృష్ట సితారలు. ఈ సరస్వతి కూడా అదృష్ట సితారయే. వీరు బ్రహ్మకు కుమార్తె కదా. ఆ జ్ఞానసూర్యుని చంద్రుడైతే వీరే (బ్రహ్మ) కదా. కానీ వీరు పురుషుడైన కారణంగా మాతపై కలశాన్ని పెట్టడం జరుగుతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే బ్రహ్మా ముఖవంశావళి, బ్రాహ్మణ కుల భూషణులైన స్వదర్శన చక్రధారీ పిల్లలకు మాత-పిత బాప్ దాదాల హృదయపూర్వకమైన, ప్రాణప్రదమైన ప్రేమతో నంబరువారు పురుషార్థం అనుసారంగా ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. కలియుగీ తమోప్రధాన సంస్కారాలను తొలగించుకుని సత్యమైన బ్రాహ్మణులుగా అవ్వాలి. ఎవరి పట్ల వైరము పెట్టుకోకూడదు.

2. నిర్భయులుగా అయ్యేందుకు ఆత్మాభిమానులుగా ఉండే అభ్యాసము చేయాలి. మనము శివశక్తి సైన్యము, మనము సత్యఖండానికి అధిపతులుగా అవ్వాలి - ఈ నషాలోనే ఉండాలి.

వరదానము:- కలియుగీ వాయుమండలంలో ఉంటూ దాని వైబ్రేషన్ల నుండి సురక్షితంగా ఉండే స్వరాజ్యాధికారీ భవ

ఎవరినైతే ఏ కర్మేంద్రియము తన వైపుకు ఆకర్షించదో, ఎవరైతే సదా ఒక్క తండ్రి వైపే ఆకర్షితులై ఉంటారో, వారినే స్వరాజ్యాధికారీ అని అంటారు. ఏ వ్యక్తి లేక వస్తువు వైపుకు ఆకర్షణ వెళ్ళకూడదు. ఇటువంటి రాజ్యాధికారులే తపస్వీలు, అటువంటి హంసలే, కొంగల యొక్క కలియుగీ వాయుమండలంలో ఉంటూ కూడా సదా సురక్షితంగా ఉంటారు. వారిని ప్రాపంచిక వైబ్రేషన్లు కొద్దిగా కూడా ఆకర్షించవు. అన్ని ఫిర్యాదులు సమాప్తమైపోతాయి.

స్లోగన్:- చెడును మంచిలోకి మార్చివేయడమే ఉన్నతమైన బ్రాహ్మణుల శ్రేష్ఠ శక్తి.